క్లుప్తంగా

నేడు శ్రీరంగరాజపురంలో డిప్యూటీ సీఎం పర్యటన

శ్రీరంగరాజపురం : డిప్యూటీ సీఎం నారాయణ స్వామి శుక్రవారం శ్రీరంగరాజపురం మండలంలో పర్యటించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మణి తెలిపారు. ఆయన ఉదయం 7 గంటలకు తయ్యూరు పాయకట్టు అరిమాణి గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారని అన్నారు. అలాగే కొత్తగా ఎన్నికైన ఆలయ పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని పల్లేరుకోనలో వెలసిన ఆత్మలింగేశ్వర స్వామిని దర్శించుకుంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నాణ్యమైన భోజనం పెట్టండి



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం : విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంపీపీ లత ఆదేశించారు. ఆమె గురువారం స్థానిక ఆర్కే ఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తోందన్నారు. నాడు-నేడు కింద కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు. జగనన్న గోరుముద్ద పథకం కింద నాణ్యమైన భోజనం పెడుతున్నట్టు వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న చిత్తూరు సీనియర్ ట్రెజరీ అధికారి చెంగల్‌రాయలు

పెనుమూరు(కార్వేటినగరం): విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని మంచి క్రమ శిక్షణతో ముందుకెళ్లాలని చిత్తూరు సీనియర్ ట్రెజరీ అధికారి చెంగల్ రాయలు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను చేరుకో వచ్చని తెలిపారు. అనంతరం సరస్వతీ పూజ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం వెంకటేశులు నాయుడు, ఎల్కేపీడూరు పాఠశాల హెచ్‌ఎం రాధాకృష్ణ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న దాత

విజయపురం : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్ తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రయ్య, దొరస్వామి శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గురువారం విద్యా సామగ్రి అందజేశారు. దాత చంద్రయ్య మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులతో పదవ తరగతి ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విజయచంద్రిక, సునీత, జ్ఞాన ప్రసాద్, వెంకటేశు, గోపి, వెంకమరాజు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న రైతులు

వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు, పెరుమాళ్లపల్లె గ్రామాలకు చెందిన 20 మంది రైతులకు గురువారం తిరుపతి వ్యవసాయ కళాశాలలో పంటల సాగుపై శిక్షణ ఇచ్చారు. ఎస్సీ సబ్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా రైతులు సాగు చేసిన పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. వేరుశనగ, అపరాల పంటలను ఆశించే పురుగులు, తెగుళ్లు, వాటి యాజమాన్య, సాగు పద్ధతుల గురించి వివరించారు. శాస్త్రవేత్త కృష్ణారెడ్డి, జాన్స్ జాన్, వసుంధర, రూపేష్ పాల్గొన్నారు.

పామాయిల్ తోటల పెంపకంపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణికి చెందిన రైతులకు గురువారం పామాయిల్ తోటల పెంపకంపై ఉద్యానవన శాఖాధికారిణి యామిని అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వాణిజ్య పంట కావడంతో పామాయిల్ గింజలకు మార్కెట్‌లో డిమాండ్ ఉందని, మంచి లాభాలు వస్తాయని తెలిపారు. ఒక మొక్క ధర రూ.193 ఉంటుందని, ఎకరాకు 57 మొక్కలు అవసరం అవుతాయన్నారు. నాలుగో ఏడాది నుంచి పంట దిగుబడి వస్తుందని, 30 ఏళ్ల సాగులో ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ.69 వేలను రాయితీగా అందజేస్తుందన్నారు. త్రీఎఫ్ ఆయిల్ ఫామ్ కంపెనీ వారితో కలిసి సుబ్రమణ్యం క్షేత్రస్థాయిలో రైతుల పొలాల్లో పామాయిల్ మొక్కలను నాటించారు. త్రీఎఫ్ జోనల్ అధికారి మురళి, ఏరియా మేనేజర్ రాజేష్, క్లస్టర్ అధికారి ఆనందబాబు, రైతులు బాలాజీ, శిఖామణి, మస్తాన్‌నాయుడు, శ్రీధర్ పాల్గొన్నారు.

పల్లెల రూపురేఖలు మారాయి

- మంత్రి ఆర్కేరోజా
- పుత్తూరులో రూ.2 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పల్లెల రూపురేఖలు మారాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కేరోజా తెలిపారు. ఆమె గురువారం పుత్తూరు రూరల్ మండలంలో రూ.2 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. పరమేశ్వర మంగళం, తిరుమల కుప్పంలో సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ భవనాలను ప్రారంభించారు. అక్కడే ఏర్పాటు చేయనున్న ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్‌కు భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే ప్రభుత్వ పాలనను తీసుకెళ్లేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, మండల కేంద్రాలకు వెళ్లే పనిలేకుండా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పినట్టు గుర్తు చేశారు. ఒకవైపు సంక్షేమం అందిస్తూనే మరోవైపు అభివృద్ధి పనులు చేపడుతున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కిందన్నారు. ఇది దేశంలో ఏ రాష్ట్రంలోను జరగలేదన్నారు. ఒక్క పరమేశ్వర మంగళం సచివాలయ పరిధిలోనే డీబీటీ నాన్ డీబీటీ కింద రూ.15.32 కోట్లను ఖర్చు చేసినట్టు వివరించారు. పల్లె నుంచి పట్టణాల వరకు సమపాళ్లలో అభివృద్ధి జరుగుతోందని, గాంధీజీ కలలుగన్న స్వరాజ్యాన్ని జగనన్న సాకారం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కే మునివేలు, మార్కెట్ యార్డ్ చైర్మన్ భాస్కర్‌యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీ సుదర్శన్, గోవిందస్వామినాయుడు, సర్పంచ్ హరి, నాయకులు వెంకటేశులు, లక్ష్మణమూర్తి, నరసింహులు, రాజయ్య, ఉదయ్, రాజా, హేమాద్రి, తదితరులు పాల్గొన్నారు.





ఆర్బీకేను ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కే రోజా, మంత్రిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఓట్ల కోసం డబ్బులు ఎర వేస్తున్న థామస్



నారాయణస్వామికి వ్యతిరేకంగా మాట్లాడాలని రూ.200 ఇచ్చారని చెబుతున్న వృద్ధురాలు

పెనుమూరు(కార్వేటినగరం) : టీడీపీ జీడీనెల్లూరు సమన్వయ కర్త థామస్ పర్యటనకు జనం కరువయ్యారు. దీంతో ఆయన డబ్బులు ఎరవేస్తున్నట్టు సమాచారం. ఆయన గురువారం ఎర్రమట్టిపల్లిలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన పర్యటనకు జనం పెద్దగా హాజరుకాలేదు. దీనికితోడు ప్రతి ఇంటి వద్దా కరోనా సమయంలో ఎక్కడున్నారని, ఇప్పుడు ఎందుకు వచ్చారని థామస్‌ను నిలదీశారు. ఈ క్రమంలో తెలుగు తమ్ముళ్లు మహిళలకు రూ.2 వందల చొప్పున అందజేసి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, జీడీనెల్లూరు వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త కృపాలక్ష్మికి వ్యతిరేకంగా మాట్లాడాలని చెప్పినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. డబ్బులతో ఓటర్లను కొనలేరని, సంక్షేమ పథకాలు అందించిన వారికే ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంటున్నారు. అదే విధంగా విడిదిపల్లిలో థామస్ పర్యటన సందర్భంగా జై జగన్, జై నారాయణస్వామి అన్న నినాదాలతో గ్రామస్తులు హోరెత్తించారు. దీంతో ఆయన తన కార్యక్రమాన్ని అర్ధంతరంగా ముగించుకుని వెళ్లిపోయారు.

అశ్వంపై పళ్లికొండేశ్వరస్వామి కటాక్షం



నాగలాపురం: సురుటుపల్లిలో వెలసిన సర్వ మంగళా సమేత పళ్లికొండేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి అశ్వ వాహనంపై విహరించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేశారు. హోమాలు చేశారు. స్వామి, అమ్మవారిని ఎంపీ గురుమూర్తి, వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వకర్త రాజేష్ దర్శించుకున్నారు. వారికి పాలక మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, కార్య నిర్వాహణ అధికారి కె.రామచంద్రారెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

పాలసముద్రం : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్(ఈవీఎం)లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ మధుబాబు తెలిపారు. శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ ఆవరణలో గురువారం సర్పంచ్ గాలి మహేష్ బాబు, వీఆర్వో తంగరాజ్ సమక్షంలో ఈవీఎంలు, వీవీపాట్‌ల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. డిప్యూటి తహసీల్దార్ మధుబాబు మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీపాట్ యంత్రాల ద్వారా పోలింగ్ పారదర్శకంగా జరుతుందన్నారు. ఓటర్లు తాము ఏ గుర్తుకు ఓటు వేశారో వీవీపాట్‌లో సరిచూసుకోవచ్చన్నారు.

సాగు ఖర్చు తగ్గేలా అవగాహన కల్పించాలి

రేణిగుంట: పంటల సాగులో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించే విధానాలపై రైతు ఉత్పత్తిదారు సంఘాలకు అవగాహన కల్పించాలని తిరుపతి ఎన్‌జీ రంగా వ్యవసాయ ప్రాంతీయ పరిశోధనా స్థానం సహ సంచాలకులు సి.రమణ తెలిపారు. మండలంలోని కరకంబాడి పంచాయతీ వనస్థలిలో ఉన్న రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ రంగంలో పెట్టుబడి ఖర్చు విపరీతంగా పెరిగిందని తెలిపారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు, తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంటల దిగుబడి సాధించే విధానాలను కేవీకేల ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం కేవీకేలోని ప్రదర్శన క్షేత్రాలను సందర్శించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు, చీనీ, నిమ్మ పరిశోధన స్థానం సహ సంచాలకులు నాగరాజు, గుంటూరు జిల్లా అంగ్రూ ప్రధాన శాస్త్రవేత్త ముకుందరావు పాల్గొన్నారు.

మీ ఇంటి బిడ్డగా ఆదరించండి



పెరుమాళ్లపల్లె గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, అధికారులు

వెదురుకుప్పం: 'సీఎం వైఎస్ జగనన్న ఆశీర్వాదంతో గంగాధరనెల్లూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అయిన తన బిడ్డ కృపాలక్ష్మిని మీకు అప్పగిస్తున్నాను.. మీ బిడ్డగా గుర్తించి తనను ఎలా ఆదరించారో అలాగే తననూ ఆదరించండి' అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కోరారు. ఆయన గురువారం పెరుమాళ్లపల్లె, దేవరగుడిపల్లె గ్రామ సచివాలయాల పరిధిలో పక్కా భవనాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గ ప్రజలు తనను అక్కున చేర్చుకున్నారని పేర్కొన్నారు. తన కుమార్తెను కూడా ప్రజలతో మమేకమై సేవ చేయడానికి ముందుకు వచ్చిందని ఆదరించాలని కోరారు.

జగనన్న చొరవతోనే నియోజకవర్గ అభివృద్ధి

జగనన్న సీఎం అయ్యాక గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నట్టు తెలిపారు. 142 గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రూ.280 కోట్లతో రోడ్ల ఆధునీకరణ, మరో రూ.300 కోట్లతో సిమెంటు రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. పెనుమూరు, కార్వేటినగరం మండలాల్లో 50 పడకల ఆసుపత్రి మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మూడు ప్రాజెక్టుల నిర్మాణం, పెనుమూరు మండలంలోని కలిగిరి కొండ, కార్వేటినగరం మండలంలో ఆలత్తూరు ఆలయం, సుబ్రమణ్యం స్వామి ఆలయాల పునర్నిర్మాణం, కొత్తగా రూ.కోటి వెచ్చించి 22 ఆలయాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు.

చంద్రబాబుకు అమ్ముడు పోయిన పీకే

చంద్రబాబు ప్యాకేజీకి పవన్ కల్యాణ్‌తో పాటు ప్రశాంత్ కిషోర్ కూడా అమ్ముడు పోయారని ఎద్దేవా చేశారు. డబ్బు, మద్యం, బహుమతులను ఎరవేసి ఓట్లను కొనుగోలు చేయాలని టీడీపీ అండ్ కో విశ్వ ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష అని కులమత వర్గ విభేదాలను పక్కన పెట్టి ప్రతి ఒక్కరికీ పథకాలు అందించిన జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. పారబాటున టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మి మరోసారి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మేలును గుర్తించి జగనన్నను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, ఎంపీటీసీలు తోకలమురళీరెడ్డి, గుణశేఖర్, కోఆప్షన్ సభ్యుడు వెంకటేష్, సర్పంచ్‌లు అన్నూరాశి, బాబు, శశికుమారి, ఆశీర్వాదం, ఎంపీడీవో పురుషోత్తం, వైద్యాధికారిణి ప్రవీణ, ఏవో వనజ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఉపాధ్యక్షుడు రామయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి గోవర్ధన్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ లోకనాథరెడ్డి, మాజీ సర్పంచులు భాస్కర్‌రెడ్డి, సంతోషం, గోవిందన్, శ్యామల, ఏఎంసీ డైరెక్టర్ గఫూర్, పురంధర్‌రెడ్డి, షణ్ముగరెడ్డి, వాసు, నారాయణ రెడ్డి, పరంధామరెడ్డి, దొర్రై, బాలాజీ పాల్గొన్నారు.

జగనన్న ఆశీస్సులతోనే పలు అభివృద్ధి పనులు



మున్సిపల్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా

- మంత్రి ఆర్కే రోజా
- రూ.1.97 కోట్లతో నిర్మించిన మున్సిపల్ భవనం ప్రారంభం

పుత్తూరు: ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాలను అందించే పురపాలక సంఘం కార్యాలయం ఓ దేవాలయం వంటిదని మంత్రి ఆర్కే రోజా తెలిపారు. ఆమె గురువారం పుత్తూరులో రూ.1.97 కోట్లతో నిర్మించిన పురపాలక సంఘం భవనాన్ని ప్రారంభించారు. ఆమెను కౌన్సిలర్లు గజమాలతో సత్కరించారు. అనంతరం నూతన భవనంలో తొలి కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పుత్తూరులో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అందులో ప్రధానంగా పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, షాదీ మహల్, మున్సిపల్ పార్క్, మున్సిపల్ ఆఫీస్, ఎలక్ట్రిక్ బరియల్ గ్రౌండ్, ఆలయాలు, పాఠశాలలు, కళాశాలలు, కమ్యూనిటీ హాల్స్ ఇలా ఎన్నో ఉన్నాయన్నారు. భగవంతుడు, ప్రజల ఆశీస్సులతో మరిన్ని అభివృద్ధి పనులు చేయడానికి జగనన్న సైన్యం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి, కాంట్రాక్టర్ చిరంజీవిరెడ్డి, చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు రాజేశ్వరి, రాధ, నవనీత, కుప్పమ్మ, భానుమతి, వనిత, కె.రాధ, జయలక్ష్మీ, జ్యోతి, షకీలా, బాలాజీ, చిట్టిబాబు, ఏకాంబరం, నరసింహారావు, పవన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్‌రెడ్డి, కార్తీక్, నారాయణ రెడ్డి, ఈశ్వరయ్యయాదవ్, పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ అభాష్

పాలసముద్రం : మండలంలోని బలిజ కండ్రిగ హైస్కూల్ ఆవరణలో గురువారం వైద్యాధికారి అభాష్ సమక్షంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా రోగులకు చెన్నై జానకినటరాజ్ నేత్ర నిలయం వైద్యులు పరీక్షలు చేశారు. డాక్టర్ అభాష్ మాట్లాడుతూ చెన్నై జానకినటరాజ్ నేత్ర నిలయం ఆధ్వర్యంలో నెలలో రెండు రోజులు ఉచిత కంటి వైద్య పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. 11 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ ఆంజనేయులు, ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశ పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న వైద్యాధికారిణి డాక్టర్ శృతిభాగ్యం



మహిళలను సన్మానిస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శృతి భాగ్యం తెలిపారు. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ సీఎస్ లత, ఎన్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ధనుంజయ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్యం- సమాజ సేవలో పాత్ర అన్న అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలన్నారు. అప్పుడే కుటుంబం అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. సామాజిక సేవలో మహిళలు అత్యున్నత పాత్ర పోషిస్తున్నారని, నేటి పోటీ ప్రపంచంలో మగవారితో పాటు సమానంగా అన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ విజయులురెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. లక్ష్యం వైపు దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు సరిత, బాలసుబ్రమణ్యం ఆచారి, కార్తీక్, జోగి ప్రసాద్, లోకేశ్వర్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

కార్వేటినగరం : మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తూ దేశానికి ఆదర్శ మూర్తులుగా నిలవాలని ఎంపీపీ లత తెలిపారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం వెలుగు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. ఏపీవో విజయకుమార్, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ఎదగాలి

నగరి : మహిళలు ఆత్మవిశ్వాసంతో ఎదగాలని నగరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. కళాశాల ఆవరణలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించారు. అందులో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల మహిళా సాధికారత విభాగం అధ్యక్షురాలు ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ లింగ వివక్ష లేని సమాజం నెలకొన్నప్పుడే నిజమైన అభివృద్ధి జరిగినట్టు అని పేర్కొన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రాజు, భాస్కర్, వేణుగోపాల్, బాషా, జ్యోతి, రేవతి, పంకజ, మహేశ్వరి, అరుణకుమారి, మునికుమారి, ఝాన్సీరాణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పుత్తూరు: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండి అన్ని రంగాల్లోనూ రాణించాలని స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీ.జానకి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వాటిని అధిగమిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. రాజ్యాంగంలోని 15వ ఆర్టికల్ మహిళలకు రక్షణ కల్పిస్తోందని తెలిపారు. మహిళలు పనిచేసే సంస్థల్లో లైంగిక దాడులు జరగకుండా కమిటీల ఏర్పాటు, లింగ నిర్ధారణ పరీక్షలు, స్త్రీ శిశు భ్రూణ హత్య చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు భాను, హరిప్రియ, జయసుధ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

వెదురుకుప్పం: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని డిప్యూటీ సీఎం కుమార్తె, వైఎస్సార్ సీపీ గంగాధరనెల్లూరు సమన్వయకర్త కే.కృపాలక్ష్మి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు తోడుగా నిలిచినట్లు చెప్పారు. భవిష్యత్తులో కూడా జగనన్న మహిళలకు మరింత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, స్థానిక సర్పంచ్ శిల్ప, ఏపీఎం, ఏపీవో, మహిళలు పాల్గొన్నారు. అదేవిధంగా చవటగుంటలోని డాక్టర్ వైఎస్సార్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ అన్నపూర్ణ శారద ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు.



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి జానకి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి

శివపూజకు వేళాయె

నగరి: మహాశివరాత్రికి నగరి మున్సిపాలిటీతోపాటు మండలంలో ఉన్న ఈశ్వరాలయాలు ముస్తాబవుతున్నాయి. పట్టణానికి 3 కిలోమీటర్ల దూరంలోని గుండ్రాజుకుప్పం పంచాక్షర గిరులపై ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన హనుమతేశ్వర క్షేత్రంలో ఏర్పాట్లు ఊపందుకున్నాయి. సరస్వతి, శివ పార్వతులు, అభయాంజనేయ స్వామి ఆలయాలను రంగుల రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భారీ ఎత్తున అన్నదానం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కీళపట్టు త్రిపురసుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని ఏకపాదమూర్తిని, అఘోరీల ప్రతిమను సిద్ధం చేసి దర్శనానికి ఉంచారు. పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలో బుగ్గఅగ్రహారం గ్రామంలో టీటీడీ ఆధీనంలో దక్షిణకాశిగా పిలవబడే అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాత్రి హరికథా కాలక్షేపం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. నగరి కామాక్షి సమేత కరకంఠేశ్వర స్వామి ఆలయంలో మంత్రి ఆర్కేరోజా బహూకరించిన నంది వాహనంపై కరకంఠేశ్వరుని ఉంచి నాలుగు కాల పూజలు, లింగోద్భవ పూజ, నందివాహన సేవ, శతరుద్ర మహాయాగం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేయనున్నట్లు ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు.

శివరాత్రికి ప్రత్యేక పూజలు

గంగాధర నెల్లూరు: మండలంలోని శివాలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు అయ్యాయి. భక్తులు జాగరణ చేయడానికి ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. మహదేవ మంగళంలో ఉన్న ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లను ఘనంగా చేపట్టినట్టు ఏఎంసీ వైస్ చైర్మన్ వేలు మొదలియార్, సర్పంచ్ ఉమ తెలిపారు. మహా కుంభాభిషేక అనంతరం మొట్టమొదటి శివరాత్రి ఉత్సవాలను ఈ ఏడాది రెండు రోజులు ఘనంగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని గంగాధరేశ్వర స్వామి ఆలయం, ఎస్‌ఎస్ కొండలో వెలసిన సిద్దేశ్వర స్వామి, కొట్రకోన మల్లేశ్వర స్వామి, వెజ్జుపల్లి ఆవు దేవర నందీశ్వరాలయాల్లోనూ శివరాత్రి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.